


# ప్రమోషన్

రుద్రాభట్ల నరసింగరావు

(డిటెక్టివ్ కథ)

రాత్రి పదిన్నరవుతుంది. అది గోదావరి జిల్లాలో ఒకపల్లెటూరు. మరీ గ్రామమూ కాదు; పెద్ద వూరూ కాదు. చిన్న పోలీసు స్టేషనూ, బ్రాంచి పోస్టాఫీసూ వంటివి కొన్ని ఉన్నాయ్. పంచాయితీ మైనరు పంచాయితీయే. ఊళ్ళో టూరింగ్ టాకీసైనా లేదు. అంచేత ఊరులోని జన సంచారం ప్రొద్దుపోగానే తగ్గిపోతుంది. పైగా అది చలికాలం. పండుగింకా 15 రోజులేఉంది. చలి విపరీతం. రామాలయం దగ్గర హరికథ చెప్తున్నారొక పోరుగూరి దాసుగారు. కొంతమంది భక్తులూ, భక్తురాండ్రూ దుప్పట్లూ, శాలువలూ కప్పుగుని, హరికేన్ లాంతర్లు, కర్రలు ప్రక్కనే పెట్టి తల లూగిస్తూ, మధ్య మధ్య దాసుగారిని ప్రశం సిస్తూ వింటున్నారు హరికథ.

ఈ ఒక్కచోట తప్పితే మిగతా ఊరంతా మాటుమణిగిపోయి ఉంది. సత్యనారాయణ గారింట్లో మాత్రం ఒక గదిలో టేబుల్ లాంపు కాంతివంతంగా వెలుగుతోంది. సత్యనారాయణ ఆ ఊరి బ్రాహ్మణులలో కల్లా భాగ్యవంతుడు. పాడీ పంటా అన్నీ ఉన్నా అనుభవించడానికి ఒక్క ఆడపిల్ల మాత్రమే ఉంది. ఆయన మద్రాసు రెండు రోజుల క్రితం వెళ్లి తన అల్లుణ్ణి తీసుకు వచ్చాడు.

రామచంద్రం మద్రాసులో అపరాధ పరిశోధకుడు. అతను రాజమండ్రిలో బి. ఎ. చదువుతున్నపుడు సత్యం అతనికి ప్రాణ మిత్రుడు. ఆ సత్యం యిప్పుడిక్కడ సబిన్స్పెక్టరుగా ఉంటున్నాడు. సరే; మామగారి మాట మన్నించినట్టూ ఉంటుంది, స్నేహితుడితో ఓ ఇద్దరు రోజులపాటు కులాసాగా గడిపినట్టూ ఉంటుందనే అభి ప్రాయంతో అత్తవారింటికొచ్చాడు చంద్రం.

ఇంట్లో అంతా హరికథకి వెళ్లారు. అత నొక్కడూ ఆ లైటుముందు కూర్చుని ఏదో ఇంగ్లీషుపత్రిక పేజీలు తిరగవేస్తున్నాడు. అతని ధ్యానంమాత్రం దానిమీద లేదు.

ఆ వేళ సాయంకాలం ఆరుగంటల ప్రాంతంలో సత్యం వచ్చి చెప్పాడు: ఒకస్త్రీ చనిపోయిందట. హత్య అయిందీ ఆత్మహత్య అయిందీ తెలీలేదు. ఊరికి చివరనున్న తోటలో జరిగింది. పల్లెటూరు, మరణప్రదేశం చుట్టూ బయలు. అంచేత పరిశోధన రాత్రే ముగించివేయాలి. 'పదిన్నరకి వస్తాను; ఇద్దరం కలిసి బయలు దేరదాం' అన్నాడు. ఇటువంటి కేసులో విజయం సాధిస్తే ప్రమోషన్ తప్పదన్నాడు సత్యం.

చంద్రం ఈ కేసు గురించి ఆలో చిస్తున్నాడు. చాలా చిత్రమైనకేసు. ఇలాటి పల్లెటూర్లో ఇంత ఘోరం! కేవలం సాయం కాలం నాలుగున్నర తర్వాత శాలుగూ ముప్పైయిదు లోపున కనుగొనబడిందిట. అయిదునిమిషాలకికూడా తక్కువన్నమాట వ్యవధి.

ఇంతలో మెల్లిగా తలుపు చప్పుడయింది. చంద్రం మఫ్లర్ తలకి చుట్టుకుని, తాళం పట్టుకుని వెళ్లి తలుపుతీశాడు. 'ఏం రెడీ యేనా?' అన్నాడు సత్యం. 'ఊఁ' అంటూ బయటికివచ్చి తలుపు తాళంవేశాడు.

సత్యం మెల్లగా ఇంగ్లీషులో 'దారిలో మాట్లాడకు. ఎవరో మనని అనుస రిస్తున్నారు,' అన్నాడు.

# ★ ప్రమోషన్ ★

ఇద్దరూ తూర్పుగా బయలుదేరారు. చీకటిరాత్రి. అందులో ఆకాశం మబ్బుపట్టి ఉందేమో ఆ చుక్కలవెలుగుకూడా కరువైంది. పదడుగులు వెళ్లేటప్పటికి సత్యంమాట నిజమైంది. రామాలయానికి పోయే సందు దాటిన తరువాత వెనక మరి అడుగుల చప్పుడు వినబడలేదు. 'హరికథ వింటున్న ఎవరికోసమో వెళ్లిఉంటారు,' అన్నాడు సత్యం.

ఊరిచివర కొబ్బరితోటలు చేరుకున్నారు. ఇందులో చాలా తోటలూ, తరువాత ఉన్న కొన్ని మామిడితోటలుకూడా సత్యనారాయణగారివే. తోటలోకి వస్తుంటే కుడివేపున ఒక గడ్డికుప్ప ఉంది. ఆ గడ్డికుప్ప దాటగానే 'ఎవరది?' అన్న కేక వినబడింది.

'మేము సుందరం!" అన్నాడు సబిన్‌స్పెక్టరు ముందుకు సాగుతూ. సుందరం అక్కడ కాపలాఉన్న పోలీసు.

'ఒహో మీరా సార్? గంటక్రిందట ఈ గడ్డిమేటు అవతలివైపున ఏదో చప్పుడయింది. ఎవరంటే పలకలేదు. అప్పట్నుంచి అకురాలితే తుపాకి ఎత్తేస్తున్నాను,' అన్నాడు సుందరం.

'ధైర్యమయినవాడివేగాని ఆ చప్పుడేవిటి?' అన్నాడు చంద్రం పరిశోధన మొదలుపెట్టినట్టుగా.

'ముందెవరో వస్తున్నట్టు అలికిడయింది. తర్వాత గడ్డితీసినట్టూ, మళ్లీ వెళ్లిపోయినట్టూ చప్పుడయింది.'

"నువ్వు వెంటనే అటువెళ్లి లేకపోయావా?'

కపటం ఎరగని ఆ కానిస్టేబుల్ 'నాకు ధైర్యం చాలలేదు సార్.' అని ఒప్పుకున్నాడు.

'ఏదీ మాకు చూపించు ఆ చోటు,' అన్నాడు చంద్రం సత్యం చేతిలోని ఫ్లాష్‌లైటును తీసుకుంటూ.

'రండిసార్' అంటూ సుందరం ముందు నడిచాడు. 'ఇదుగో ఇక్కడే సార్.'

చంద్రం లైటువేసి గడ్డికుప్ప వెతికాడు. ఒక చెప్పులజత దొరికింది.

'అరె! చిత్రంగాఉంది సార్. సాయంకాలం ఆరింటికి నాకు అటువేపు గడ్డిలో ఓ చెప్పులజతా, ఓ జేబురుమాలూ దొరికాయి' అన్నాడు సుందరం.

'సత్యం, ఈ చెప్పులు గుర్తుపట్టగలవేమో చూడు.' అన్నాడు చంద్రం తనకి దొరికిన జతని ఇస్తూ. సత్యం వాటిని ఇటూ అటూ త్రిప్పిచూశాడు.

'ఇవుగో నాకు దొరికినవి.' అంటూ సుందరం రుమాలూ, జోడూ పట్టుకొచ్చాడు.

చంద్రం రుమాలు చూశాడు. తెల్లనిది-ఓమూల ఎర్రని దారంతో 'ల' అని కుట్టబడి ఉంది.

'ఈ చెప్పులు మా పోలీసుల్లో' ఒకడివి సత్యం అన్నాడు.

'పేరు?' చంద్రం ప్రశ్నించాడు.

'లచ్చన్న'

'అరె! లచ్చన్న జోడా అది?' అని ఆశ్చర్యపోయాడు సుందరం.

'ఈరుమాలు చూడు.' అన్నాడు చంద్రం దాన్ని సత్యానికి అందిస్తూ.

'ఊఁ ఈ పొడక్షరాన్నిబట్టి ఇదీ అతనిదనే అనుకోవాలి.' అన్నాడు సత్యం.

'ఈ ఆకుజోడు చూడు,' అన్నాడు చంద్రం.

దాన్ని పరిశీలించనారంభించాడు సత్యం.

'నాకొ శవాన్ని చూపించు' అన్నాడు చంద్రం పోలీసుతో.

పోలీసు తన చిన్న టార్చిలైటు సత్యానికిచ్చి ముందుకు నడిచాడు.

ఒకచోట ఆగి 'లైటువెయ్యండి' అన్నాడు సుందరం.

చంద్రం తన మూడుసెల్సు ఉండే బ్యాటరీలైటు వేశాడు. అంతవరకు చీకట్లో ఉన్న ఆ ప్రదేశం వెలుగులోకి వచ్చిన తర్వాత కనిపించిన భయంకరదృశ్యానికి చంద్రంఅంత గుండెనిబ్బరంగల వ్యక్తికికూడా ఒళ్ళు గగుర్పొడిచింది. ఇరవైఏళ్ళ సుందర యువతిశవం ఒకటి మామిడిచెట్టు కొమ్మనుంచి వ్రేళ్లాడుతోంది.

చంద్రం తెప్పరిల్లి ఆప్రాంతం అంతా చూశాడు. శవం ఉన్న చెట్టు గడ్డికుప్పచేత మరుగుపర్చబడింది. నేలంతా ఎండి బీటలు వారిన నల్లరేగడి భూమి. ఎటువంటిబూట్లతో వచ్చినాసరే అడుగుజాడ పడదు ఆ నేలలో.

తర్వాత చెట్టుదగ్గరకి వెళ్ళాడు చంద్రం. శవం వ్రేళ్లాడుతున్న కొమ్మ భూమినుంచి సుమారు ఆరున్నర అడుగుల ఎత్తుంటుంది. రమారమి అయిదడుగుల ఎత్తున్న ఈ స్త్రీ పాదాలకీ, భూమికీ మధ్య ఒక అరడుగు ఎడం ఉంటుంది.

'హత్యాసమయం ఎలా నిర్ణయించేవురా సత్యం?' అన్నాడు తీవ్రంగా శవాన్ని చూస్తూ.

'ఆఁ? హత్యాసమయమా? మా పోలీసాకతను, ఈ ప్రాంతంగుండా నాలుగున్నరకి వెళ్లాట్ట. అప్పుడేమీ లేదుట ఇక్కడ.'

'సరిగ్గా నాలుగున్నరకే?'

'ఆఁ. కాని నాలుగూ నలభైఅయిదుకి సేషన్‌కి ఈ స్త్రీ మొగుడొచ్చి ఏడ్చాడు. వాడిక్కణ్ణుంచి అక్కడికి రావడానికి కనీసం పదినిమిషాలైనా కావాలి.?

'అంచేత నాలుగూ ముప్ఫయైదుకి శవాన్ని చూసివుంటాడనా? నీకు ఈమెయిల్లు తెలుసా?' అని పోలీసువైపు తిరిగి ప్రశ్నించాడు.

'యస్సార్, వాణ్ణి పిలవమంటారా?' అనడిగి అనుమతిపొంది వెళ్ళిపోయాడు సుందరం.

లైటు కాంతిలో దగరగా శవాన్ని చూస్తూ 'ఈమె పేరు?' అనడిగాడు చంద్రం.

ఇంకా ఆ చెప్పుల జతని గురించ ప్రయత్నిస్తున్న సత్యం 'దాని పేరా? సావిత్రి' అన్నాడు.

'కులం?'

'ఆదియాంధ్ర'

'వ్యవసాయ కూలీలా?'

'ఆఁ'

'ఈమె ప్రవర్తన మంచిదేనా?'

'ఆ సందేహం నీ కెందుకు వచ్చింది?' అని ఎదురు ప్రశ్నించాడు సత్యం.

'సాధారణంగా అందమైన ఆడవాళ్ళ హత్యకి దాంతో సంబంధం ఉంటుందిలే.'

'ఇది ఆత్మహత్య ఎందుకు కాగూడదు?'

'అవొచ్చున్రా బాబూ; కాదని నే అన్నానా? నేనడిగినదానికి చెప్పవేం!'

నువ్వడిగినదానికి జవాబు సందేహంగా ఉంది. ఊళ్లో ఎంతమందిని కనుక్కున్నా కొంతమంది మంచిదంటారు కొంతమంది కాదంటారు. అందరితోటీ చలాకీగా మాటాడుతుందనిమాత్రం నే నెరుగుదును. మా పోలీసులు కొంతమందితో వేళాకోళాలాడుతుంటుందికూడా.'

'అన్నట్టు నాలుగున్నరకిటొచ్చినపోలీసు పేరేఁవిటి?'

'నీకు దొరికిన ఆకుజోడుగలవాడు: లచ్చన్న.'

'అయితే ఆ రెండో జోడు గుర్తుపట్టావా?'

'లేదు. అలాటి జోడు లోడగ్గా నేనెవర్నీ చూడలేదు. ఇది కొత్తది.'

'లచ్చన్న ఇక్కణ్ణుంచి స్టేషన్‌కి ఎన్ని గంటలకి తిరిగొచ్చాడు?'

'అయిదుంపావుకి.'

'అప్పుడేమయినా భయపడుతున్నట్టున్నాడా?'

'ఊహుఁ. కాని జేనిగురించో విచారిస్తున్నట్టుమాత్రం కనిపించాడు.'

చంద్రం ఆలోచిస్తూ తనలో తనుకుంటున్నట్టు 'చిత్రంగా ఉంది. సరిగ్గా నాలుగన్నరకే ఇక్కడికి వచ్చినట్టు అతనికి ఎందుకు జ్ఞాపకం వుంది?' అన్నాడు.

సావిత్రి చీరా రవికా చాకింటివి. నల్లని చీర చక్కగా సింగారించుకుని, కుడిపైట వేసి కొంగు బిగించి మొలలో దోపుకుంది.

ఎఱ్ఱని రవికె ఆమె పచ్చని శరీరానికి బాగా కుదిరింది. ఒత్తుగా ఉన్న నొక్కుల జుత్తుని వున్నగా దువ్వుకుని బర్మాముడి వేసుకుంది. తలలో బంతిపూలచెండు తురుముకుంది. శవం వెనుకభాగాన్ని పరీక్షిస్తూ 'ఇలారా సత్యం' అన్నాడు.

సత్యం వచ్చాక మెడవెనుక పుటాకారంగా ఉండి ఎత్తు భాగాలు అభిముఖంగా ఉన్న రెండు వాట్లు చూపించాడు. [అవి](ఈ విధంగా ఉంటాయని పాఠకులు గ్రహించగలరు.]

ఇంతలో సుందరం సావిత్రి భర్తని వెంటబెట్టుకొచ్చాడు. వాడి పేరు రాములని చెప్పాడు సత్యం. వాడు వస్తూనే ఏడుస్తూ 'నా యింట్లో ఈ శత్తిర్నించి అంతా సీకటే బాబూ.'అంటూంటే చూపరుల కళ్లు చెమ్మగిల్లక మానవు.

సబిన్‌స్పెక్టర్ వాణ్ణి ఓదార్చేటప్పటికి తల ప్రాణం తోక్కొచ్చింది.

చంద్రం 'ఊరుకో రావులూ. నీకు జరిగిన అన్యాయానికి కారకులైనవాళ్ళని మేం శిక్షించడానికి ప్రయత్నిస్తున్నాంగా. నువ్వు మా ప్రశ్నలకి సమాధానం చెప్పి దానికి సాయపడు. మీకు పెళ్ళయి ఎన్నేళ్ళయింది" అన్నాడు.

'అయిదేళ్లవుద్ది బాబూ' అన్నాడు రాములు కళ్ళొత్తుకుంటూ.

'మీ సంసారం అనుకూలంగా ఉంటుందా ?'

'ఏ కలతా లేకుండా సాఫీగానే సాగి పొయ్యేది బాబూ.'

'నీ భార్య ప్రవర్తనవిషయంలో నీకేమైనా అనుమానం ఉందా ?'

'లేదు బాబూ లేదు. సావిత్రి పేరుకు తగ్గపిల్ల. ఊరికే ఆళ్లతోటీ ఈళ్లతోటీ ఏళాకోళా లాడుద్దని అదంటే కొందరికి గిట్టదు...'

'సరే ఇవాళ యింట్లో ఎలా ఉంది ?'

'ఏం సెప్పమంటారు బాబూ?' అని కళ్ళు తుడుచుకుని 'పొద్దున్న పదింటికి ఊళ్లోంచి తిరిగొచ్చినాది. ఏటో పట్టలేని సంతోషంతో ఎఱ్ఱి బాగుల్ది కులికింది; గెంతింది. సేపలయ్యొండి, బోం చేస్తున్నంతసేపూ సెలవ తీసుకుంటున్నట్టే సూసింది బాబూ; కొనుకోలేకపోనాను. మద్దినాడ ఊ ముస్తాబయింది. నాలుగింటికి బయలుదేరినాది. ఏడకోలమ్మో అని నానడగనేదు. అది సెప్పనేదు.' అన్నాడు రాములు.

'ఇది హత్యని నీకు అనుమానం ఉందా రావులూ?'

'నాను సెప్పలేను బాబూ.'

'సరే. సత్యం! ఈ ప్రాంతంలో ఇంకేమైనా ఆధారాలు దొరుకుతాయా?'

'సార్, అదేదో లాంతరు మనకేసే వస్తోంది.'

'రానీవోయ్ ఫర్వాలేదు. ఇంకేం దొరకవు రామచంద్రం! నే నిదివరకే వెదికాను.'

'అయితే పద.'

ఇద్దరూ గృహోన్ముఖులయారు జోళ్లూ, రుమాలూ తీసుకుని. ఇందాకటి లాంతరు వారిని క్రమంగా సమీపిస్తోంది.

'ఎవరా వచ్చేది? ఇనస్పెక్టరుగారా?' అన్నాడా వ్యక్తి.

సోమనాథంగారి గొంతు అది. ఈయనకి కూడా దగ్గర దగ్గర సత్యనారాయణగారి ఆస్తిపాటి ఉంది. మంచి దయార్ద్రహృదయుడు. ఒక్క సరస్వతీ కటాక్షంతప్ప తక్కినవన్నీ ఉన్నాయని చెప్పవచ్చు. వూళ్ళో ఎవరికేకష్టం వచ్చినా తాను స్వయంగా అక్కడికి వెళ్లి చేతనైన సాయంచేసి వస్తూంటాడు.

'అవునండి సోమనాథం గారూ. ఇలా ఎందాకా వెడుతున్నారు?' అన్నాడు సత్యం.

'అడుగో ఆరాఁవులు లేడూ? వాడింటికి వెళ్ళాను. ఇటొచ్చాడని తెలిసి వాణ్ని చూడ్డానికి వస్తున్నాను. కాని ఇనస్పెక్టరుగారూ, ఇంత ఘోరం మన వూళ్ళో, మన తాలూకాలో ఎప్పుడూ ఎరగం అనుకోండి. ఆపిల మాటకేం? ఉత్తరాయణ పుణ్యకాలప్రవేశంలో దానిపసుపూ కుంకుమా చల్లగా ఉండగా వెళ్ళిపోయింది. కాని ఈ కూనికోరు ముండాకొడుక్కి ఏఁవైనా గతులుంటాయా...'

చంద్రం సగంలో అందుకుని 'అహఁహ మీ రలా అనగూడదు. హంతకుడు కూడా హతురాలి కొంగుపట్టుకొని స్వర్గంలో దూరుతాడు లెండి,' అన్నాడు నవ్వుతూ.

'హ హ్హ హ్హ మీ మాఁవగార్ని కొరకొరనమనడంలో చూపించాలి బాబూ ఈ చమత్కారం అంతా.'

'మీ రింకా సత్యకాలపు మనుషులండీ. వెధవకొరుకోసం అల్లుడికి పెద్దచమత్కారం ఎందుకండీ? "మీపిల్లని తీసుగెళ్ళ" నంటే సరిపోదూ?' అని నవ్వాడు సత్యం.

'అహ్హ హ్హ, బాగుంది. అస లింతకీ వాడి జాడ తీశారా?'

'అస లిదింకా హత్యో కాదో నిర్ణయించలేదండి.'

'ఎంతమాట మీ బుద్ధికి తోచకపోవడం ఏఁవిటి? ఈ కేసుతో ప్రమోషన్ రావాల్సింది.' 

'యావలి మరి మీకు.'

సత్యం నవ్వాడు. 'మరి వెళ్ళరండి అక్కడే ఉన్నాడు రాఁవులు' అన్నాడు.

'ఆఁ సెలవు మరి' అంటూ సోమనాథంగారు తోటవైపు వెళ్లారు.

కొంతసేపయినతర్వాత చంద్రం 'మీ పోలీసు లచ్చన్న యిక్కడ!' అని అడిగాడు.

'మనింటికి దగ్గర్లో నేలే ఏం?'

'అత నీహత్యగురించి ఏదో దాస్తున్నాడు. ఆ ఆకుజోడూ — నాకు దొరికినది — ఆ రుమాలూ నిశ్చయంగా అతనివే అయితే మనం అతనిచేత జరిగినదేఁవిటో చెప్పించవచ్చు.' అన్నాడు చంద్రం సాలోచనగా.

'అవి అతనివేలే. కాని ఇది హత్యని నువ్వెలా అనుకుంటున్నావ్. అయిదునిమిషాల వ్యవధిలో అంత బలమైన స్త్రీని చంపడం—అందులో ఉరితియ్యడం—ఊహాతీతంగా ఉంది.'

'అక్కడే లచ్చన్న ఏదో దాస్తున్నాడంటున్నాను. హంతకుడు ఎవరైనప్పటికీ హత్య నాలుగున్నరకి పూర్వమే జరిగి ఉండాలి. అతను హంతకుడుకాకపోతే నాలుగున్నరకి అక్కడేమీ లేదన్నమాట అబద్ధం. పైగా ఆ స్థలాని కొచ్చేటప్పటికి నాలుగున్నర సరిగ్గా అయిందని అతని కెలా జ్ఞాపకం ఉంది? ఆ టైముకి ఏమీ ప్రత్యేకత ఉండకుండా ఉండదు.'

'సరే, దాని మెడమీద వెనుకవున్న వాట్లు మాటేమిటి?'

చంద్రం ఒకక్షణం ఆలోచించి 'హంత


# అతిమూత్ర వ్యాధి నెమ్మదించును

మూత్రంలో చక్కెరపోవటం అతిమూత్ర వ్యాధి (DIABETES) అంటారు ఇది ఎంత ఉపద్రవకరమైన వ్యాధి అంటే, దీని పాలబడినవారు ఆరోజుకారోజు మృత్యువుకు ఆసన్నమౌతుంటారు ఈజబ్బు లక్షణాలలో ముఖ్యమైనవి క్షువగా దాహం, ఆకలి, తరచుగా చక్కెరతోగాని, లేక చక్కెరలేకుండగాని మూత్రం బయలు వెడలటము, దురద మొదలైనవి వీనస్ ఛారమ్ అనేక సంవత్సరములు పరిశోధనల ఫలితంగా తయారు కాబడినది దీన్ని వాడటంవల్ల వేనకు వేల మందిమృత్యుముఖమునుండి బయటపడ్డారు. దీన్ని వాడితే రెండవలేక మూడవ రోజు నుండేమూత్రంలో చక్కెర తగ్గించి. అత్యధిక మూత్రంకూడా నివారిస్తుంది మూడురోజుల తర్వాత మీకు బాగా తేలిక ఇస్తుంది దీనికి పత్యంలేదు. ఇన్‌జెక్షన్లు అవసరం లేదు. వివరములు గల ఇంగ్లీషు కరపత్రానికి వ్రాయండి. ఉచితంగా పంపెదము.

50 బిళ్లల బుడ్డి ఖరీదు రు. 6-12-0 లు.

ప్యాకింగు పోస్టేజి ఉచితము.

Venus Research Laboratory(A,P,W)

P. O. Box No. 587, Calcutta.

# ★ ప్రమోషన్ ★

వాడు ఆమెను బతికుండగా ఆలాడెక్కించలేదనడానికి అవి సాక్ష్యం' అన్నాడు.

'నా కర్థం కాలేదు.'

'అంటే ఆమె పీక నొక్కి చంపాడని. వెనుకనుంచి పీక నొక్కేటపుడు మన బొటన వేళ్లు అవతలి వ్యక్తి మెడ వెనక్కి ఎదురెదురుగా వస్తాయ్‌గదూ? అంటే అవి గోరు నాట్లన్నమాట.'

'అయితే హంతకుడు మంచి బలమైన వాడు కావాలిగా!'

'ఆఁ'

'సరే రేపు మనం లచ్చన్నయింటికి వెడదాం. పొద్దున్నే లే.'

ఆ రాత్రి సత్యానికి చాలాసేపు నిద్రపట్టలేదు. ఇదే తను పనిచేస్తున్న మొదటి హత్యకేసు అవడం వల్లనేమో, అనుకున్నాడోకమారు; న్యాయంమీదకంటె ప్రమోషన్ మీద ఉండడంవల్లనేమో అనుకున్నాడు. కడుపులో ఏదో గాభరాగా ఉన్నట్టుంటే ఏదైనా అశుభాన్ని సూచిస్తోందేమో అనుకున్నాడు. ఇంతలో కుడికన్ను అదరడం మొదలెట్టింది. ఫర్వాలేదని ఒత్తిగిల్లాడు. నవ్వుకున్నాడు మనసులో-ఎప్పుడూ ఎరగని మూఢవిశ్వాసాలు ఇవాళ వచ్చినందుకు.

* * *

అలా నిద్రపట్టక ఎంతసేపు బాధపడ్డాడో సత్యానికి తెలియదు. కాని చిన్నకునుకు పట్టేటప్పటికి తలుపు తట్టారెవరో. తెలిసిన వార్త: లచ్చన్న తన స్వంతయింటిలో, పడకగదిలో క్రూరంగా కత్తితో హత్యగావింపబడ్డాడని. సత్యం నిలువునా కంపించాడు. లచ్చన్న! సావిత్రికేసులో కొంతవరకూ సాయపడతాడనుకున్న లచ్చన్న హత్యగావింపబడ్డాడు. ఉన్న ఒకే ఒక్క ఆధారం కాస్తా జారిపోయింది. టైము చూస్తే ఒంటిగంటన్నర. గబగబ లచ్చన్నయింటకి వెళ్ళి పోలీసులని ఆయింటికి కాపలా ఉంచి పాతుడిగదికి తాళంవేసి తన గదికొచ్చి పడుకున్నాడు.

పొద్దున్న ఎనిమిదింటికి డాక్టరొకడిని రప్పించి, చంద్రంతో సహా లచ్చన్న గృహానికి వెళ్లారు. ఆయిల్లు చాలా పెద్దది. లచ్చన్న కుటుంబం పండక్కి పుట్టింటికి వెళ్లినందువల్ల ఇపుడాఇంట్లో అతని అక్క అన్నపూర్ణ—వితంతువు—ఒక్కతే ఉంటోంది. డాక్టర్ శవపరీక్షకి గదిలోకి వెళ్లాడు.

అన్నపూర్ణ రాగాలతో పావుగంటసేపు చెప్పిన విషయ సారాంశం ఇది: ఆరున్నరకి ఇంటికొచ్చిన లచ్చన్న ముఖంలో లవలేశం కళ లేదు. విచారంతో చిన్నబోయివుంది. దగ్గర దగ్గర ఎనిమిదింటికి అన్నానికరమ్మంటే ఆకలి లేదన్నాడు. కాఫీ పట్టుకెళ్ళి టేబుల్ మీదుంచింది. తర్వాత తలుపేసుగోమని చెప్పి ఆమె హరికథకి వెళ్ళింది. తిరిగి వచ్చేసరికి గదిలో టేబుల్ లాంపు వెలుగుతూంటే ఆమె ఆగదిలోకి తొంగిచూసింది. కంటపడినది ఈ ఘోరం. అప్పుడు సుమారు ఒంటిగంటవుతుంది.

చంద్రం, సత్యం దొడ్డిలోకి వెళ్ళారు. పాదులూ, కూరగాయల మొక్కలతో నిండివుంది. దానిని ఆనుకుని సుమారు అయిదడుగుల ఎత్తుగోడ వుంది చుట్టూ. కంట్లో కన్నుపెట్టుగు పరిశీలిస్తే దొడ్డిగోడవద్ద రెండు పాదాల గుర్తులు ఒకదాని కొకటి దగ్గరగా ఉన్నాయ్. చంద్రం ఆ రెండో చెప్పుల జత-సుందరానికి దొరికినది - వాటి మీద ఉంచాడు. చెప్పు అంచుతో పాదపుటంచు ఏకీభవించింది. చంద్రం చిరునవ్వునవ్వాడు. ఇంకెక్కడా ఏ గుర్తూ కనిపించలేదు.

గదిలోకి వచ్చారు. డాక్టర్ పరీక్ష పూర్తిచేసి 'కనీసం పదకొండుగంటలయి వుంటుంది హత్యజరిగి.' అని వెళ్ళిపోయాడు. చంద్రం తన వాచి చూసుకుంటే ఎనిమిదిన్నర అయింది. అంటే రాత్రి $9\frac{1}{2}$ లోపున జరిగింది హత్య; అన్నపూర్ణమాట ప్రకారం ఎనిమిదిపైన.

గదంతా ఒకసారి కలయజూశాడు చంద్రం. మొత్తం అక్కడున్న సామానులు: ఒక టేబులూ దాని ముందొక కుర్చీ, ఒక చిన్న పుస్తకాల బీరువా, చిన్న ట్రంకుపెట్టె. టేబుల్ సొరుగులూ, బీరువా, పెట్టె తాళికి వేయబడి ఉన్నాయ్.

'సావిత్రికి చదువొచ్చునా సత్యం?'

'ఆఁ. తెలుగు మాత్రమే. ఏం?'

'మీ పోలీసు నొకడిని పంపి సావిత్రి శవాన్ని సోదాచేయించు.'

సత్యం మారుపలక్కుండా బయటికి వెళ్ళాడు.

ఒక గోడకి దగ్గరగా మంచం ఉంది. దీని మీద లచ్చన్న బోర్లా పడుకునిఉండగా వీపు మీద కత్తిపోట్లు పొడవబడ్డాయ్. అన్నపూర్ణ తెచ్చిన కాఫీగ్లాసు—నున్నని వెండి గ్లాసు—మాత్రం టేబుల్ మీదుంది. ఇంతే క్రిందనున్న సామాను. గోడకి రెండు మూడు కేలండర్లూ, ఒక గడియారం—పదకొండూ అయిదు దగ్గర ఆగిపోయినది—ఉన్నాయ్.

చంద్రం గడియారం అద్దం తెరచి కీ చూశాడు. పూర్తిగా ఉంది. నిన్ననే కీ యిచ్చాడని చెప్పింది అన్నపూర్ణ. 'ఓహో! ఎవరో ఆపి ఉండాలన్నమాట,' అన్నాడు.

సత్యం తిరిగివచ్చి శవం జేబులు జాగ్రత్తగా వెదికాడు. 'L' అని మార్కు వేయబడిన రుమాలొక్కటిమాత్రం దొరికింది. చంద్రం దాన్ని చూస్తూ చటుక్కున ఏదో స్ఫురించినవాడిలా లచ్చన్న బట్టల పెట్టె సమీపించాడు. అతని అన్ని బట్టలమీద అదే అక్షరం మార్కు వేయబడి ఉన్నది.

'బ్రదర్! ఈ 'ల' అని కుట్టబడి వున్న రుమాలుకి ఆ రెండో చెప్పుల జతతో సంబంధంవుంది. లచ్చన్నది కాదది. పైగా అవి మీ పోలీసు సుందరానికి ఒకేసారి ఆరుగంటకే దొరికాయ్. ఇది ఆ అభిప్రాయాన్ని బలపరుస్తోందా లేదా!' అన్నాడు చంద్రం నవ్వుతూ.

సత్యం చిన్న నవ్వునవ్వి ఊరుకున్నాడు.


చంద్రం టేబుల్ మీద కాఫీ వెండిగ్లాసు చూశాడు. దానిమీద వ్రేలిముద్రలుస్పష్టంగా ఉన్నాయ్. ఎందుకైనా మంచిదని గ్లాసు అంచుపట్టుకొని జాగ్రత్తగా సొరుగులో పెట్టి తాళంవేశాడు.

ఇంతలో ఒక పోలీసు తిరిగివచ్చి సత్యానికి ఒకచీటి యిస్తూ 'అది బిగించి మొలలో దోపుకున్న కొంగున ముడివేయబడి ఉంది సార్ ఈ చీటీ' అన్నాడు.

సత్యం ముఖంలో ఒక కాంతి తళుక్కున మెరిసింది. పొంగిపోతూ విప్పినవాడల్లా మరుక్షణంలో వెలతెల పోయాడు. ఇదంతా, సూక్ష్మపరిశీలకుడు చంద్రం గమనించక పోలేదు.

చంద్రం అందుకున్నాడా కాగితాన్ని: ఒకటి రెండు రాత్రులు మాత్రం సావిత్రితో సుఖించాలని ఉందనీ, తన కోరికని నిరాకరించకుండా వుంటే దానికి డబ్బుకొదువ ఇంక ఉండదనీ ఏ మాటా చెప్పడానికి మరునాటి ఉదయం $9\frac{1}{2}$కి సత్యనారాయణగారి కొబ్బరితోటలో ఉండమనీ అందులోని సారాంశం. పైన 'డిసెంబరు 27 శుక్రవారం' అని ఉంది. సంతకం లేదు. ఇవాళ 29 ఆదివారం. కాబట్టి సావిత్రిని తోటలో కలవమన్నది నిన్న ఉదయమే!

(54-వ పేజీ చూడండి)



# ★ ప్రమోషన్ ★

(16-వ పేజీ తరువాయి)

ఈ ఉత్తరాన్ని చూసీ చూడ్డంతో సత్యంముఖంలో నెత్తురు చుక్క లేకుండా ఎందుకయిందో చంద్రానికి అంతుపట్టలేదు. బహుశా ఈ వ్రాత ఎవరిదో గుర్తుపట్టి, ఏకారణంవల్లనో ఆవిషయాన్ని దాచ ప్రయత్నిస్తున్నాడు. భలే ప్రభుత్వోద్యోగులు. నిన్నరాత్రి లచ్చన్న ఏదో దాస్తున్నాడని గ్రహించినపుడు తనకి అంత ఆశ్చర్యం కలగలేదు. కాని సబిన్‌స్పెక్టరే దాచడమా?

హఠాత్తుగా అన్నపూర్ణ వైపు తిరిగి 'నిన్న పొద్దున్న లచ్చన్న ఇంట్లో వున్నాడా?' అన్నాడు.

'లేదు బాబూ. పదింటికి తిరిగొచ్చాడు. కాఫీతాగి వెళ్ళాడు ఏడింటికి' అందామె.

'అప్పుడెలా ఉన్నాడు'

'మామూలుకంటె బాగా హుషారుగా ఉన్నాడు. ఉత్సాహంతో సర్దాగా మాట్లాడాడు.'

చంద్రం ఫకాలున నవ్వాడు. 'అతని చేతిరాతవున్న కాయితాలు ఏవైనా ఉంటే ఇవ్వండి' అన్నాడు అమితోత్సాహంతో.

అన్నపూర్ణ యింటి జమాఖర్చుల పుస్తకం బీరువాలోంచి తీసింది.

చంద్రం దాన్ని చటుక్కున తెరచి కనుబొమలు ముడిచి ఆ రెండువ్రాతలనీ పోల్చి చూచి, నిరాశగా దాన్ని జారవిడిచి, నిట్టూర్చి అన్నాడు. 'ఈవుత్తరం: లచ్చన్నది కాదు. ఆరుమాలు కూడా కాదు.'

కుర్చీలలో కూలబడి యిద్దరూ ఆలోచించసారంభించారు. సత్యం సాధ్యమైనంత మామూలుగా ఉండడానికి ప్రయత్నిస్తున్నాడు. చంద్రం సత్యాన్ని అర్థంచేసుకోవడానికి తంటాలు పడుతున్నాడు. ఈ విషయంలో అతనేదో దాస్తున్నాడన్న సంగతి రూఢిగా నిశ్చయపర్చుకున్నాడు చంద్రం. ఏవిటి దాస్తున్నాడన్న మాటలావుంచి ఎందుకుదాస్తున్నాడని తర్కించుకోసాగాడు. హంతకుడివలన భయమా? ఛా. ధైర్యశాలియైన తనమిత్రుడిగూర్చి అటువంటి ఊహ వచ్చిందేవిటి? కాదు. భయంకాదు. మరేమిటి?

'ఫోంచేసి రెండింటికివద్దాం రాచంద్రం, పోదాంపద' అన్నాడు సత్యం లేస్తూ.

'పద' అని చంద్రంకూడా లేచాడు.

దారిలో ఆచీటీని సత్యాని కిచ్చివేస్తూ, నీ ధర్మాన్ని నువ్వు నెరవేర్చడంలో ఎవరి, లేక దేనిభయాన్ని నీమనసులోకి రానీకు సత్యం. ప్రమోషనూ వస్తుంది; నీవల్ల ప్రజకి న్యాయమూ జరుగుతుంది; ప్రభుత్వానికి విశ్వాసపాత్రమైన సేవా లభిస్తుంది. వెనుదీయకు' అన్నాడు ఇంగ్లీషులో చంద్రం.

మౌనంగా తలవంచుకు గది చేరాడు సత్యం. తలనొప్పిమాత్రలు వేసుకున్నాడు; కణతలకి అమృతాంజనం పూసుకున్నాడు; నిట్టూర్పులతో భోజనంమాటకూడా మరిచి మంచంమీద పడుకున్నాడు. ఒకసారి అతని నోటినుంచి 'ఛీ! సంఘంలో సత్ప్రవర్తన; చాటుగా నీచప్రబతుకు. వెధవమనుష్యులు! పాడులోకం!!'

అతని మనసులో రెండు విరుద్ధశక్తులు ఒకదానితో ఒకటి యుద్ధం చేస్తున్నాయ్.

* * *

'అలావున్నారేం?' అంది సుశీల గదిలోకి వస్తూనే. సుశీల సోమనాథంగారి చెల్లెలు. ఈవూరొచ్చిన క్రొత్తలో సత్యం వారింట్లోనే బసచెయ్యడంవల్ల వీరిద్దరికీ మంచి పరిచయం కలిగింది. వేరే వచ్చిన తరువాత రోజూ సుశీల సత్యంగదికి వచ్చి చక్కగా సర్దిపోతూంటుంది. ఇప్పుడూ అదేపనిమీద–'అదేవంకమీద'—వచ్చింది.

సత్యం బదులు పలకలేదు.

'తలనొప్పా?'

'ఊఁ' అన్నాడు సత్యం అటుతిరిగి పడుకునే.

'రాత్రి హరికథకి వచ్చారా?' అంది టేబుల్ మీది పుస్తకాలు సర్దుతూ.

'ఉహుఁ'

"ఏంబాగా చెప్పాడనుకున్నారు! పిట్టకథలు చక్కగా చెప్పాడులెండి. ప్రస్తుతం ఒక్క గవర్నమెంటు ఉద్యోగికూడా తన డ్యూటీ సరిగా చెయ్యలేడుట. ఒకసారిట అమ్మా, ఒక ఖూనీకోరు ఖూనీచేసి సైకిలెక్కి పారిపోయాడుట. గంటతర్వాత ఆ సంగతి తెలిసి ఓ సబినస్పెక్టరుగారేమో కారువేసుకుని బయలుదేరారట. 'రంయ్' మని పోనిచ్చారు. సరిగ్గా ఇంక పదిగజాలలో హంతకుణ్ణి దాటేస్తుందిట ఈయనగారి కారు. ఇంతలో నేమో అటునుంచి ఓ మాంఛి సినీమానటి వస్తోందిట కారుమీద. 'అలో' అందిట ఈయన్ని చూసి కారు ఆపేస్తూ. అపళంగానమ్మా ఇనస్పెక్టరుగారి కళ్లు కాస్తా జిగేలుమన్నాయిట. ఇంకేముంది. కారాపి 'అలో' అని ఈయనగూడా అన్నారుట. అవిడేమో ఈయన చెయ్యిపట్టుకుందిట – దానిపేరు షేకండనో ఏదో అన్నారులెండి. ఈలోపున పిట్ట కాస్తా ఎగిరిపోయిందిట. పాపం ఆయన 'అలో లక్షణా!' అనుకుంటూ ఇల్లు చేరుకున్నారుట!......'

'ఊఁనీ పనయిందా? 'అన్నాడు సత్యం కోపాన్నణుచుకుంటూ విసుగ్గా.

'ఆఁ' అంది సుశీల చిన్నబుచ్చుకుంటూ.


సుశీల కింకా అసలు ఊళ్ళో హత్యలు జరిగినట్టే తెలీదన్న సంగతి తెలిస్తే సత్యానికి అంతకోపం వచ్చేదిగాదు.

సత్యం సుశీలని గాఢంగా ప్రేమించాడు. ఆ ప్రేమే లేకపోతే ఇవాళ యిన్ని మనోవ్యథలకు గురి అయ్యేవాడు కాదు.

చివరకు ఒక దృఢనిశ్చయానికి వచ్చి లేచాడు.

* * *

సత్యం, చంద్రం కలిసి యిద్దరు పోలీసులతో సహా లచ్చన్న యింటికి వెళ్ళారు. పోలీ

—ము బయటనుంచుచున్నారు. సావిట్లో అన్నపూర్ణని ఓదారుస్తూ సోమనాథంగారు కనిపించారు.

వీరిని చూడగానే 'ఏఁవండోయ్? ఏం పట్టేశారా?' అన్నాడాయన.

'ఇంకా ఏమీ తేలలేదండి'

ఇద్దరూ వచ్చి చెరో కుర్చీలో కూర్చోగానే అన్నపూర్ణ లోపలికి వెళ్ళింది. అంత దుఃఖంలోనూ అతిథి మర్యాదకోసం మూడు వెండి గ్లాసులతో కాఫీ తెచ్చిపెట్టింది.

ముగ్గురూ ఎత్తారు గ్లాసులు. సోమనాథంగారు ఒకగుక్క త్రాగి వేడిగా ఉందని క్రిందపెట్టారు. వెంటనే సత్యం చప్పట్లు కొట్టడం, ఇద్దరు పోలీసులూ వచ్చి అయన రెక్కలువిరిచి పట్టుగోడం, ఒక్కసారిగా జరిగాయ్.

"ఆరి ముండాకొడకా పట్టేశావ్?" చంద్రం ఆయన గ్లాసులోని కాఫీ పారబోసి, గ్లాసుని సొరుగులో పెట్టాడు.

అన్నపూర్ణ ఒక్కసారిగా నిర్ఘాంతపోయి చేష్టలుదక్కి ఉంది.

'సుశీల నీ చెల్లెలు కాకపోతే పొద్దున్నే ఇది జరిగేది' అన్నాడు సత్యం నిలబడుతూ.

'హుఁ చావంటే భయపడే పిరికిపంద ననుకున్నావ్ కాబోలు. గౌరవం నిలబెట్టుగోడం కోసం ప్రాణాన్ని తియ్యగలను; ఇయ్యగలను. నిన్న తొమ్మిదిన్నరకి ఆ తోటలో ఆ సావిత్రిముండా, ఈ లచ్చన్నా గడ్డికుప్ప కాడ గుసగుసలాడుతున్నారు గుసగుసలు. సాయంత్రం నాలుగున్నరకి నాచీటీ వాడికి తెచ్చియిస్తుందిట. నన్ను బెదిరించి డబ్బు గుంజితే ఇద్దరూ లేచిపోదామనుకున్నారు. అంత చవట ననుకున్నారు. నాలుగున్నరలోపున ఆ ముండ పనిపట్టించేశాను. చీటీ చేజిక్కించుకోకముందే ఈ లచ్చన్నగాడొచ్చాడు. వాడికి భూమ్మీద గింజల్లేవింక. అంతే. ఎనిమిదిన్నరకి పెరట్లోంచి వచ్చి వీడిని అముండదగ్గరకి పంపించాను. ఇల్లంతా వెతికి పోయాను. అప్పట్నుంచి మీ వెనకో, మీతో కలిసో, తిరుగుతూనే వచ్చాను-మీపనులు కనిపెడదామని. చావంటే భయంవుంటే ఎప్పుడో మీ కంటపడకుండా పారిపోయేవాణ్ణి ..ఇప్పుడేం చేసుకుంటారో చేసుకోండి మీయిష్టం. నన్నిక్కడే కాల్చెయ్యండి-తయారుగా ఉన్నాను...ఆగ్లాసెందుకయ్యా దాచావ్?'

'ఆకాఫీ ఎవరు త్రాగారో ఋజువు..'

'ఏడిసినట్టుంది నీఋజువు-నేనేతాగాను. కాకపోతే హత్య ఆవిడ కాఫీ అక్కడ పెట్టిన కొద్దిసేపట్లోనే జరిగిందనుకుంటారని నాకు తెలుసు. గడియారం ముందుకుపెట్టి ఆపిందీ నేనే. ఇంకేం కావాలో ఏమన్న చెపుతాను.'

'ఈ రుమాలు మీ దేనా?' అన్నాడు చంద్రం గడ్డికుప్పదగ్గిర దొరికిన దాన్ని చూపిస్తూ.

'నా పెళ్ళాం లలితమ్మది. అక్కడ పొరపాటున పడిపోయింది. లచ్చన్నని చంపిన తర్వాత వాడిచెప్పులు తీసికెళ్ళి అక్కడుంచాను. రాత్రి తొమ్మిదింటికి'

సోమనాథం అనేకప్రశ్నలకిదేధోరణిలో జవాబు చెప్పాడు. చంద్రం ఊహలన్నీ రైటే అయాయ్.

తర్వాత చంద్రం చెప్పాడు· 'హంతకుడవైనప్పటికీ నిన్ను కొన్నివిషయాలలో నేను ప్రశంసించాలి. ఈహత్యలలో చాలా తెలివిగా ప్రవర్తించడం అలావుంచి అతి ధైర్యంతో శిక్షకి భయపడకుండా అందరిలో మామూలుగా సంచరించగలిగే నీవంటివాడిని నేనింతవరకూ చూడలేదు. నీవుచేసినవి రెండే పొరపాట్లు. ఒకటి గడ్డికుప్పలో నీజోగు వదిలికూడా ఈయింటి దొడ్లోంచి వచ్చేటప్పుడు నీఅడుగుజాడలు పడకుండా చూసుకోకపోవడం. దీనివల్ల రెండు హత్యలూ ఒకరే చేశారని తెలిసిపోయింది నాకు. రెండు: హతుడి గదిలో కాగితాలూ పుస్తకాలూ అంతగా కెలికివేయడం. నేను వాటిని చూడగానే సావిత్రికి చదువొచ్చునేమో, ఆమెదగ్గరున్న ఏదో కాగితం కోసం ఈ హత్యలు జరిపారేమో అన్న సందేహం వచ్చింది....."

* * *

ఇక్కడితో ఈ కథ సరిపెట్టవచ్చు. కాని మా పాఠకులంతా శ్రమతీసుకుని ఆలోచించలేమోనని సంక్షిప్తంగా తేల్చివేస్తాను తక్కిన కథని.

సబిన్స్పెక్టరు సత్యానికి ప్రమోషన్ వచ్చింది. అయితే అది అతనికి దానిమీద ఆశ పోయినతర్వాత వచ్చింది. ఇతనికి హంతకుడు ఫలానా అని తెలియగానే కలిగినది ఆనందంకాదు; సందిగ్ధ పరిస్థితి. సోమనాథాన్ని ఏమిచెయ్యడం? అతన్ని శిక్షించినందువల్ల ప్రమోషన్ రావచ్చు; కాని అంతకంటె వాంఛనీయమైన ప్రియురాలిని కోల్పోతాడు; అతన్ని న్యాయవిరుద్ధంగా రక్షించగల శక్తి తనకి ఉంది. అలాచేస్తే సుశీల పాణిగ్రహణం సులభం. కాని తద్వారా ప్రభుత్వాన్నీ ప్రజలనీ మోసగించిన వాడవుతాడు. ఫలితం తన నైతిక పతన ప్రారంభం.

ఇలాటి పరిస్థితిలో సుశీల వచ్చింది. ఈమె రాకలోని ప్రత్యేకత సుస్పష్టం. మనసు గట్టిపరుచుకున్నాడు సత్యం. మనిషిగా ప్రవర్తించాలనుకున్నాడు.

హంతకుని సతిదుఃఖం మీ ఊహకు వదిలి పెడుతున్నాను.

ఇక, రెండుదెబ్బలు తిన్న వ్యక్తి సుశీల. తండ్రిసెరుగని ఆ పిల్ల లోకంలో మగవారినిద్దరినే ప్రేమించింది: ఒకడు ప్రియుడు సత్యం; రెండోవాడన్న. ఇద్దరికిద్దరూ అమెకిగాకుండా పోయారు. ప్రతిసాయంకాలం ఆడాబామీద నిలబడి ఆమె దూరంగా కనిపించే కొబ్బరి మామిడితోటలూ, క్రొత్త సబిన్స్పెక్టరు వచ్చిన ఆ చిన్న పోలీసుస్టేషనూ, హరిజనవాడలో సావిత్రి యింటి అరుగుమీద చుట్టకాలుస్తూ శూన్యంలోకి చూసే రాములూ, లంకంత లచ్చన్న యింటి ముందర ఇసుకలో ఆడే తండ్రిలేని అజ్ఞానపు పసికందులూ గడచిన గాథని జ్ఞప్తికి తేగా బాధగా నిట్టూరుస్తుంది.

సుశీల కనుకొలకులలో రెండు కన్నీటి బిందువులు తళుక్కున మెరుస్తాయ్. గిరుక్కున తిరిగి క్రిందికి దిగి పరుపుమీద వ్రాలి వెక్కి వెక్కి ఏడుస్తుంది అమాయిక సుశీల ★

# స్త్రీలు; వ్యాయామం

(39-వ పేజీ తరువాయి)

మకళనూ, "స్థూలత్వం తగ్గించడానికి అనే వ్యాయామకళనూ అభ్యసించడంవలన ఈ అవాంతరాలు నిరోధించుకోవచ్చు.

## పొత్తికడుపు బలానికి

మంచంమీద వీపుపై పడుకోవాలి. తల మంచంయొక్క ఒకకొసను క్రిందికి వ్రేలాడేటట్టు చేయాలి. ఇప్పుడు తలను స్వేచ్ఛగా ఎత్తాలి. బుజాలుకూడా పైకిఎత్తాలి. ఇప్పుడు గాలిని బయటకువిడచి ఊపిరి బిగబట్టకుండా ఉండాలి.

కాన్పు కష్టమైనప్పుడు ప్రసవానికి సంబంధించిన కండరాలు చాలా శ్రమకు లోనై ఉంటాయి. "గర్భకోశం వ్రేలాడడం" అనే అనారోగ్యస్థితికూడా రావొచ్చు.

ప్రసవానంతరం మంచంపై పరుండగానే మంచం చివర తలను క్రిందుగా వ్రేలాడేసి గాలిని పూర్తిగా ఊపిరిగొట్టాంనుండి వదలి ఊపిరి బిగబట్టాలి. కొద్దిరోజులతరువాత ముక్కవచ్చుకూడా. ఇందువలన పొత్తికడుపు కండరాలకూ, ప్రసవావస్థలో పాల్గొన్న ప్రతికండరానికి వ్యాయామం కలిగి కండరాలు యధాస్థితిలోనికివచ్చి. కొవ్వుపట్టడమూ, సాగిపోవడమూ నిరోధించబడవచ్చు.

ఇవేకాక ప్రత్యేక అవాంతరాలలో ప్రత్యేక వ్యాయామ భంగిమలు ఉన్నాయి. అవి ఆంధ్రపత్రికపేర నాకు వ్రాసినట్టయితే ప్రత్యేకంగానో, పత్రికాముఖంగానో జవాబిచ్చి మీసందేహాన్ని నివృత్తి చేయగలను. ★